
సాక్షి
కామారెడ్డి
శనివారం । 26 । ఆగస్టు । 2023



### బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తాం

కామారెడ్డితో పాటు గజ్వేల్‌లోనూ కేసీఆర్‌ను ఓడించి బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు.

- 8లో ▸



### మంచం పట్టిన తండా

రాజంపేట మండలంలోని అన్నారం తండాలో ప్రతి ఇంట్లో విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.4 /24.6

### వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం ఎండ తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం మేఘావృతం కావచ్చు. చిరుజల్లులు కురిసే అవకాశముంది.

## న్యూస్‌రీల్

### మెడికల్ కాలేజీలో కొనసాగుతున్న అడ్మిషన్లు

• 58 మంది విద్యార్థుల చేరిక

సాక్షి, కామారెడ్డి : నీట్ ర్యాంకుల ఆధారంగా కామారెడ్డి మెడికల్ కాలేజీలో సీట్లు పొందిన విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. తెలంగాణ కోటాలో 50 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందగా, జాతీయ కోటాలో 8 మంది సీట్లు పొంది జాయినయ్యారు. దీంతో కాలేజీలో చేరిన విద్యార్థుల సంఖ్య 58కి చేరింది. జాతీయ స్థాయిలో నిర్వహించే నీట్ రాసిన విద్యార్థులు సీటు కోసం దరఖాస్తులు చేసుకోగా ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. అందులో భాగంగా కామారెడ్డి కాలేజీలో ఇప్పటి వరకు 58 మంది జాయిన్ అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు.

### 'సాగర్' నీరు విడుదల



నిజాంసాగర్(జుక్కల్) : ఆయకట్టు కింద సాగుచేస్తున్న పంటలకు సాగు నీటి అవసరాల నిమిత్తం శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. లక్షా యాభై వేల ఎకరాల్లో పొలాలకు నాల్గో విడత నీటిని ప్రధాన కాలువ ద్వారా అందిస్తున్నామన్నారు. ప్రాజెక్టు నుంచి 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 1404.42 అడుగులు 16.964 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

### సీపీగెట్‌లో ఉత్తమ ఫలితాలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ గ్రామ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ఇటీవల వెలువడ్డ సీపీగెట్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాధిక శుక్రవారం తెలిపారు. కళాశాలకు చెందిన మహేశ్వరీ ఎంఎస్సీ జువాలజీ విభాగంలో 72వ ర్యాంక్, ఫిజిక్స్ విభాగంలో ఎం.భువనేశ్వరీ 77వ ర్యాంక్, ఎస్ పల్లవి 95వ ర్యాంక్ సాధించినట్లు ఆమె పేర్కొన్నారు.

### సీఎంకు కృతజ్ఞతలు



కామారెడ్డి టౌన్ : తెలంగాణ నూతన సచివాలయంలో మజీద్ నిర్మాణంతో పాటు దేవాలయం, చర్చి నిర్మాణం చేయించిన సీఎం కేసీఆర్‌ను తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, కామారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎంకే ముజీబొద్దీన్ శుక్రవారం అభినందించారు. సీఎంను సన్మానించి బహుమతి అందజేశారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ తదితరులు కూడా ఉన్నారు.

### 28న భిక్కనూరుకు ఎమ్మెల్సీ కవిత

భిక్కనూరు : ఈనెల 28వ తేదీన భిక్కనూరు మండల కేంద్రానికి ఎమ్మెల్సీ కవిత విచ్చేస్తున్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నందున ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీసిద్ధరామేశ్వరాలయంలో కవిత సోమవారం ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. మండల కేంద్రంలోని ఎస్వీ గార్డెన్‌లో సమావేశంలోపాల్గొంటారు.

### కేసీఆర్‌కు ధనార్జనే ధ్యేయం



కామారెడ్డి టౌన్ : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తెలంగాణ ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు అరుణతార మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశ్‌కి నేత అనుకుంటూ ధనార్జనే ధ్యేయంగా లక్ష్యం పెట్టుకున్నాడన్నారు. వచ్చే నెలలో హైదరాబాద్‌లో మిలియన్ మార్చ్ నిర్వహిస్తామన్నారు. బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి తదితరులున్నారు.

### సైబర్ సెక్యూరిటీ విభాగం డీఎస్పీగా శ్రీనివాస్

సాక్షి, కామారెడ్డి : పోలీస్ శాఖలో సైబర్ సెక్యూరిటీ విభాగం కామారెడ్డి డీఎస్పీగా టీ శ్రీనివాస్‌కు శుక్రవారం పోస్టింగ్ ఇచ్చారు. కొత్తగా ఈ విభాగం ఏర్పాటు చేశారు.

# దిశకు డుమ్మా!

• వాయిదాలు పడి.. చివరకు మొక్కుబడిగా సమావేశం
• సరైన సమాచారమివ్వని అధికారులపై కలెక్టర్ ఆగ్రహం
• హాజరుకాని ఎమ్మెల్యేలు



దిశ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పాటిల్, పాల్గొన్న అధికారులు

సాక్షి, కామారెడ్డి : వాయిదా పడుతూ వచ్చిన 'దిశ' సమావేశం ఎట్టకేలకు శుక్రవారం జరిగినా ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంతో మొక్కుబడిగా ముగిసింది. కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టే పథకాల అమలుపై సమీక్షించేందుకు మూడు నెలలకోసారి జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం స్థానిక ఎంపీ అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గడిచిన ఆరు నెలలుగా వాయిదా పడుతూ వచ్చిన సమావేశం శుక్రవారం ఎంపీ బీబీ పాటిల్ అధ్యక్షతన జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగింది. సమావేశంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, డీఆర్‌డీవో సాయన్న, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు. కొన్ని శాఖల అధికారులు సమావేశానికి డుమ్మా కొట్టారు. జిల్లాలో 22 మండలాలు ఉండగా, కేవలం ఏడుగురు ఎంపీపీలు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మిగతావాళ్లెవరూ సమావేశానికి హాజరు కాలేదు. నలుగురైదుగురు ఎంపీపీలు తమతమ మండలాల్లో వివిధ సమస్యలు, జరిగిన కార్యక్రమాల పురోగతిపై ప్రశ్నలు అడిగారు. కాగా గతేడాది నవంబర్ 11న దిశ సమావేశం జరిగింది. తర్వాత మూణ్నెళ్లకొకసారి జరగాల్సి ఉన్నా, ఏదో ఒక కారణంతో వాయిదా పడుతూ వచ్చింది. కాగా ఎంపీ బీబీ పాటిల్ ఆయా శాఖల ద్వారా జరిగిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు.

**గోడౌన్ నిర్మాణానికి అనుమతివ్వండి..**

మాచారెడ్డి మండలం సోమారంపేటలో స్వయం సహాయక సంఘాల మహిళలు పంట ఉత్పత్తుల నిల్వల కోసం గోడౌన్ నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, అనుమతివ్వాలని ఎంపీపీ నర్సింగరావ్ కోరారు. దీనిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అభయహస్తంతో పాటు వడ్డీలేని రుణాలకు సంబంధించిన బకాయిలు రావడం లేదని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ తెలపగా ప్రభుత్వం నుంచి రిలీజ్ కాగానే అందజేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించాలని సభ్యులు కోరగా, పరిశీలిస్తామన్నారు. ఉపాధిహామీలో సీసీ రోడ్లలాగే పొలాలకు వెళ్లేందుకు గ్రావెల్ రోడ్లకు అనుమతి ఇవ్వాలని పలువురు సభ్యులు కోరగా, పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు.

**అంబులెన్స్‌ల నిర్వహణపై ఎంపీ ఆగ్రహం**

తన నిధుల నుంచి వైద్యారోగ్య శాఖకు ఇచ్చిన అంబులెన్స్‌లకు డ్రైవర్లను సమకూర్చకుండా వైద్యశాఖ అధికారులు మూలనపడేయడంపై ఎంపీ బీబీ పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలల తరబడిగా మూలన ఉంటున్నాయన్నారు. దీనిపై డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మి ఇచ్చిన సమాధానాలు సరిగా లేవంటూ కలెక్టర్ పాటిల్ వారిపై అసహనం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోరా అని ప్రశ్నించారు. దీంతో 108 కిందకు తీసుకుని నడుపుతామన్నారు. మాచారెడ్డి మండలంలోని ఆరేపల్లి గ్రామస్తులు అన్నారం పీహెచ్‌సీకి వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని, మాచారెడ్డి పీహెచ్‌సీకి మార్చాలని ఎంపీపీ నర్సింగ్‌రావ్ కోరారు. మాచారెడ్డి పీహెచ్‌సీ బిల్డింగ్ వర్షంతో ఊరుస్తోందని, మరమ్మతులు చేయించాలని ఎంపీపీ కోరగా రూ. 12 లక్షలు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామని కలెక్టర్ తెలిపారు.

**తికమక సమాధానాలొద్దు..**

రేషన్ బియ్యం విషయంలో నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ అడిగిన ప్రశ్నలకు సివిల్ సప్లై అధికారి మల్లికార్జున్ చెబుతున్న సమాధానం సరికాదని, కన్ఫ్యూజ్ చేసేలా మాట్లాడొద్దంటూ కలెక్టర్ వార్నింగ్ ఇచ్చారు. పెళ్లయి అత్తారింటికి వెళ్లిన అమ్మాయి పేర్లు రేషన్ కార్డుల్లో తొలగిస్తున్నా, అత్తారింట నమోదు చేయడం లేదని పలువురు సభ్యులు పేర్కొన్నారు. రేషన్ డీలర్‌పోస్టుల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. విద్యుత్‌శాఖపై జరిగిన చర్చలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వాహనాలు ఉండట్లేదని నాగిరెడ్డిపేట ఎంపీపీ రాజ్‌దాస్ పేర్కొన్నారు. రోడ్లు భవనాలు, జాతీయ రహదారులు, పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్ శాఖలపై చర్చ జరిగింది.

**ఆర్‌అండ్‌బీ అధికారులకు షోకాజ్ నోటీసులు**

దిశ సమావేశానికి సరైన సమాచారం ఇవ్వకపోవడంపై కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో సాయాగౌడ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**అక్రమ డిప్యుటేషన్‌పై చర్యలేవి..?**

రామారెడ్డిలోని పోసానిపేటలో టీచర్‌ను అక్రమంగా డిప్యుటేషన్‌పై పంపారని, తమకు సమాచారమివ్వలేదని ఎంపీపీ దశరథ్‌రెడ్డి ఆరోపించారు. వెంటనే డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని డీఈవో రాజును కలెక్టర్ ఆదేశించారు. రామారెడ్డి బాలికల ఉన్నత పాఠశాలలో కూడా సమస్యలను ఏకరువు పెట్టారు. నాగిరెడ్డిపేట మండలం బొల్లారం, తాండూర్, అక్కపల్లి గ్రామాల్లో మధ్యాహ్న భోజనం పెట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ రాజ్‌దాస్ పేర్కొన్నారు. వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. సదాశివనగర్ ఎంపీపీ అనసూయ మాట్లాడుతూ ధర్మారావుపేట స్కూల్‌లో టీచర్ల కొరత ఉందన్నారు. మాచారెడ్డి ఎంపీపీ లోయపల్లి నర్సింగ్‌రావ్ మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎన్ఆర్ఈజీఎస్ బిల్లులు రాక ఇబ్బందులు వస్తున్నాయన్నారు. దీనిపై అధికారులతో మాట్లాడతానని కలెక్టర్ పేర్కొన్నారు.

# బాన్సువాడ నుంచి భారీ పోటీ

• కాంగ్రెస్‌లో టిక్కెట్ల కోసం ముగిసిన దరఖాస్తు గడువు!



సాక్షి, కామారెడ్డి : అసెంబ్లీ ఎన్నికల్లో టిక్కెట్ కోసం కాంగ్రెస్ పార్టీలో దరఖాస్తులకు ఇచ్చిన గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. కామారెడ్డి నుంచి మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఒక్కరే దరఖాస్తు చేసుకోగా ఎల్లారెడ్డి నుంచి ముగ్గురు, జుక్కల్ నుంచి నలుగురు, బాన్సువాడ నుంచి పదమూడు మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. దరఖాస్తులను పార్టీ హైకమాండ్ పరిశీలించిన అనంతరం సర్వేల ఆధారంగా బలాబలాలను అంచనా వేసి టిక్కెట్లు కేటాయిస్తుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అధికార పార్టీ ఇప్పటికే నాలుగు నియోజకవర్గాల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించింది. కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, హన్మంత్ సింధే పోటీ చేయనున్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి ఎవరు పోటీ చేస్తారన్నది తేలాల్సి ఉంది.

**కాంగ్రెస్ టిక్కెట్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు వీరే..**

| | | | |
|---|---|---|---|
| బాన్సువాడ | కాసుల బాల్‌రాజు (నియోజక వర్గ ఇన్‌చార్జి) | కామారెడ్డి | షబ్బీర్ అలీ (మాజీ మంత్రి) |
| | యలమంచిలి శ్రీనివాస్‌రావ్ (సీనియర్ నాయకుడు) | ఎల్లారెడ్డి | మదన్‌మోహన్‌రావ్ (పీసీసీ ఉపాధ్యక్షులు) |
| | కూనిపూర్ రాజిరెడ్డి (కాంగ్రెస్ నాయకుడు) | | వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి (పీసీసీ ప్రధాన కార్యదర్శి) |
| | ప్రతాప్‌సింగ్ (సీనియర్ నాయకుడు) | | రాజేశ్వర్‌రెడ్డి (సీనియర్ నాయకుడు) |
| | డాక్టర్ మోతీలాల్ (వైద్యుడు) | జుక్కల్ | సౌదాగర్ గంగారాం (మాజీ ఎమ్మెల్యే) |
| | అంబర్‌సింగ్ (జడ్పీటీసీ సభ్యుడు) | | గడుగు గంగాధర్ (డీసీసీ మాజీ అధ్యక్షుడు) |
| | ఆర్.వెంకట్రాంరెడ్డి (మాజీ ఎమ్మెల్సీ) | | లక్ష్మీకాంతరావ్ (ఎన్ఆర్ఐ) |
| | మాసాని శ్రీనివాస్‌రెడ్డి (సీనియర్ నాయకుడు) | | అయ్యల సంతోష్ (సామాజిక కార్యకర్త) |
| | శ్రీనివాస్‌గౌడ్ (సీనియర్ నాయకుడు) | | |
| | ఆర్.జ్యోతిర్మయరెడ్డి (యూత్ నాయకుడు) | | |
| | డాక్టర్ అనిల్ రెడ్డి (యూత్ నాయకుడు) | | |
| | శంకర్ (మాజీ జెడ్పీటీసీ) | | |
| | ఇందూరు శేఖర్ (సర్పంచ్) | | |

# మరింత పటిష్టంగా వాల్టా చట్టం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం : వాల్టా చట్టం ప్రకారం భూగర్భ జలాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. 2002లో ఏర్పాటు చేసిన వాల్టా చట్టాన్ని మరింత బలోపేతం, అమలు కోసం ప్రభుత్వం ఇటీవల జీవో.15ను విడుదల చేసిందన్నారు. ఈ విషయమై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. చట్టం ప్రకారం పరిశ్రమలు, షాపింగ్ కాంప్లెక్స్, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్స్, హౌసింగ్ సొసైటీలు, మంచినీటి ప్లాంట్లు, స్విమ్మింగ్ పూల్స్, ఫంక్షన్ హాల్ తదితర వాటిలో బోర్లు వేయడానికి తప్పనిసరిగా భూగర్భ జల శాఖ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) తీసుకోవాలన్నారు. డిజిటల్ వాటర్ ఫ్లో మీటర్‌ను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వ్యక్తిగత అవసరాలకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చిందన్నారు. మిగిలిన వారు వినియోగించే నీటిని బట్టి కనీస చార్జీలు చెల్లించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, భూగర్భ జల శాఖ ఏడీ సతీష్ యాదవ్, జిల్లా పరిశ్రమల అధికారి లాలూనాయక్, డీఎస్‌వో మల్లిఖార్జున్ బాబు, డీపీవో శ్రీనివాస్‌రావు, ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ తిరుపతి, విద్యుత్ శాఖ ఏడీ మల్లేష్, రాం నారాయణ తదితరులున్నారు.

# ప్రజల గుండెల్లో నిలిచిన వ్యక్తి గద్దర్

• ఆయన ఆశయాల సాధన కోసం పోరాడాలి
• గద్దర్ సంస్మరణ సభలో వక్తలు



మాట్లాడుతున్న సంధ్యక్క

కామారెడ్డి టౌన్ : ప్రజల గుండెల్లో నిలిచే ప్రతిధ్వని ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని, ఆయన ఆశయాల సాధనకై ప్రతిఒక్కరూ పోరాటాలు చేయాలని వక్తలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కళాభారతి ఆడిటోరియంలో నిర్వహించిన గద్దర్ సంస్మరణ సభకు హాజరైన వక్తలు ప్రసంగించారు. మా భూమి సంధ్యక్క మాట్లాడుతూ గద్దర్ పోరాట స్ఫూర్తిని ప్రతిఒక్కరూ చాటాలన్నారు. ఆయన భౌతికంగా దూరమైనా ప్రజల గుండెల్లో బతికే ఉన్నాడన్నారు. కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూరం అభినవ్ మాట్లాడుతూ గద్దర్ జీవితాన్ని పాఠ్యపుస్తకాల్లో పాఠాలుగా చేర్చాలన్నారు. రాష్ట్ర ఏర్పాటులో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేసిన వ్యక్తి గద్దరే అన్నారు. ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడారు. ఈ సభలో సియాసత్ ఎడిటర్ జహీరుద్దీన్ ఖాన్‌కు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజాఫ్రంట్ కన్వీనర్ హన్మంత్‌గౌడ్, కామారెడ్డి జేఏసీ కన్వీనర్ జగన్నాథం, కో-కన్వీనర్ నర్సింహారెడ్డి, అంబేడ్కర్, పూలే అసోసియేషన్ కన్వీనర్ బండి కిరణ్, తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్, టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, బీడీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఆజాద్, టీపీఎఫ్ కన్వీనర్ నాగభూషణం, డీటీఎఫ్ విజయరామరాజు, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కళాకారులు ఆటపాటలతో అలరించారు.

# కామారెడ్డిలో కాషాయ జెండా ఎగరేస్తాం

• బీఆర్ఎస్‌కు అధికారమిస్తే 'కుడా' పేరుతో దోచుకుంటారు
• బైయింగ్, రూలింగ్, సెల్లింగ్ (బీఆర్ఎస్) కేసీఆర్ లక్ష్యం
• బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ఓడించి తరిమికొడుతామని, అలాగే కామారెడ్డిలో కాషాయ జెండా ఎగరేయడం ఖాయమని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌కు కామారెడ్డి ఓటమితో రాజకీయాల ఉంచి శాశ్వతంగా రిటైర్మెంట్ ఇప్పిస్తామన్నారు. మొదటి నుంచి ఇప్పటివరకు కేసీఆర్ రాజకీయం, బీఆర్ఎస్ చరిత్ర చూస్తే బైయింగ్, రూలింగ్, సెల్లింగ్ పాలసీ అన్నారు. అందుకే ఆ పేరు పెట్టుకున్నారన్నారు. కామారెడ్డికి వస్తున్న సీఎం కామారెడ్డి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(కుడా) ఏర్పాటు చేసి బస్వాపూర్ నుంచి సదాశివనగర్ వరకు భూముల్లో ఇండస్ట్రీ పెట్టి దోచుకుంటారన్నారు. కామారెడ్డిలో ఉన్న 20వేల ఎకరాల ప్రభుత్వ భూములపై కన్ను వేశాడన్నారు. గజ్వేల్‌లో ఏం అభివృద్ధి జరిగిందో ప్రజలు తెలుసుకోవాలన్నారు. రోడ్లు, లైట్లు అభివృద్ధి కాదని, ప్రజలకు కడుపునిండా భోజనం ఏర్పాటు, చదువు, ఆరోగ్యం అవసరమన్నారు. గజ్వేల్‌లో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మంత్రి హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి మూడు వర్గాలతో దోచుకుంటున్నారని సాక్ష్యాలతో నిరూపిస్తానన్నారు. అవసరమైతే గజ్వేల్ వెళ్లి అక్కడ అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్నారు. గజ్వేల్‌లో ఓడిపోతానని తెలిసే కేసీఆర్ కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారన్నారు. కాళేశ్వరం, మల్లన్నసాగర్, రంగనాయక్ తదితర ప్రాజెక్టులలో కేసీఆర్ చేస్తున్న అవినీతి వివరాలను వెల్లడించారు. పెన్షన్, రైతుబంధుకు చెల్లిస్తున్న రూ. 20 వేల కోట్లు మద్యం అమ్మకాలపై వస్తున్న డబ్బేనన్నారు.

**కామారెడ్డి ఎమ్మెల్యే మంచోడే కానీ..**

కామారెడ్డి ఎమ్మెల్యే గంపగోవర్ధన్ మంచోడేనని కానీ ఆయన చుట్టూ నవగ్రహాల్లాంటి నేతలు ఆయన పేరుతో దోచుకున్నారన్నారు. కేసీఆర్ వస్తే గజ్వేల్‌లో ఉన్న లీడర్ల మాదిరిగా ఇక్కడా తయారవుతారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ, సీఎం కేసీఆర్‌లను ఇద్దరినీ ఓడిస్తామని శపథం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, కౌన్సిలర్లు నరేందర్, రవి, శ్రీనివాస్, నాయకులు విపుల్, సురేష్ తదితరులున్నారు.

# ప్రాజెక్టులకు పెరగనున్న భద్రత

• నీటిపారుదల శాఖకు ఉద్యోగుల కేటాయింపు
• విధుల్లో చేరుతున్న సిబ్బంది



నిజాంసాగర్‌లోని గుల్‌దస్తా వద్ద పిచ్చిగడ్డిని తొలగిస్తున్న కొత్తగా వచ్చిన సిబ్బంది

నిజాంసాగర్(జుక్కల్): గ్రామ సేవకుల వ్యవస్థను రద్దు చేసిన ప్రభుత్వం వీఆర్ఏలను వివిధ శాఖల్లో భర్తీ చేసింది. దీంతో నీటిపారుదలశాఖలో ఉద్యోగుల సందడి నెలకొంది. జిల్లా నీటిపారుదలశాఖ ఆధ్వర్యంలో 265 మంది ఉద్యోగులకు లష్కర్లుగా, హెల్పర్లుగా పోస్టింగ్‌లిచ్చారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరు మండలాల పరిధిలో 84 మంది, కామారెడ్డి జిల్లాలో 181 మంది ఉద్యోగులు నీటిపారుదలశాఖలో ఉద్యోగాలు పొందారు. గతంలో జిల్లా నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన జలశయాలు, చెరువులు, కుంటలు, ఆనకట్టలు, పంట కాలువల పర్యవేక్షణకు ఉద్యోగులు, సిబ్బంది కరువయ్యారు. అంతేకాకుండా ఉమ్మడి జిల్లా వరప్రదాయని అయిన నిజాంసాగర్ ప్రాజెక్టు, పోచారం, కౌలాస్ ప్రాజెక్టు, కళ్యాణి, సింగితం రిజర్వాయర్‌తో పాటు చెరువులు, కుంటలకు భద్రత కరువైంది. నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో 160 మంది మెయిన్ మజ్దూర్లు, గ్యాంగ్‌మెన్లు, సిబ్బంది ఉండగా పదవి విరమణతో ఉద్యోగుల జాడ కరువైంది. అలాగే పోస్టుల భర్తీ లేకపోవడంతో ప్రాజెక్టులు ఉద్యోగుల్లేక వెలవెలబోయాయి. వర్షాలు, వరద సమయంలో వరద గేట్లు ఎత్తేందుకు కూడా సిబ్బంది లేక ఇబ్బందులు పడ్డ సందర్భాలున్నాయి. ప్రస్తుతం వీఆర్ఏలతో ఈ ఖాళీలను భర్తీ చేశారు.

**విధుల్లో చేరుతున్న ఉద్యోగులు**



జిల్లా నీటిపారుదల శాఖలో ఉద్యోగులు విధుల్లో చేరుతుండటంతో ఖాళీ పోస్టులన్నీ నిండుతున్నాయి. నిజాంసాగర్ డివిజన్‌లో 93 మంది ఉద్యోగులు, బాన్సువాడ డివిజన్‌లో 120 మంది ఉద్యోగులు, ఎల్లారెడ్డి డివిజన్లో 42 మంది, కామారెడ్డి డివిజన్‌లో 11 మంది ఉద్యోగులు విధుల్లో చేరారు. అలాగే నిజామాబాద్ జిల్లాలోని రుద్రూర్, కోటగిరి, ఎడపల్లి, పోతంగల్, చందూర్, వర్ని మండలాల్లో 84 మంది ఉద్యోగుల పోస్టులు భర్తీ అయ్యాయి.

– శ్రీనివాస్, జిల్లా నీటిపారుదల శాఖ సీఈ

# కస్తూర్బా పాఠశాలలకు సీఆర్‌టీలు

• జిల్లాలో 56 సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టుల భర్తీ
• పాఠశాలల్లో తీరిన ఉపాధ్యాయినుల కొరత



లింగంపేట కస్తూర్బా పాఠశాల

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : కస్తూర్బా పాఠశాలల్లోని విద్యార్థినులకు మెరుగైన విద్యనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల పరీక్ష నిర్వహించింది. పరీక్ష ఫలితాల్లో మెరిట్ మార్కులు సాధించిన వారితో కస్తూర్బా పాఠశాలల్లోని సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేయడంతో టీచర్ల కొరత తీరింది. కస్తూర్బా పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం అధికారులు గత జూలైలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో పరీక్ష నిర్వహించారు. సుమారు వారంరోజుల క్రితం పరీక్ష ఫలితాలను విడుదలచేసి మెరిట్ జాబితాను రూపొందించారు. మెరిట్ జాబితా ఆధారంగా ఎంపికైన లభ్యర్థులకు అధికారులు నియామక పత్రాలను అందజేశారు.

**జిల్లాలో 56 పోస్టుల భర్తీ..**

జిల్లాలో మొత్తం 19 కస్తూర్బా పాఠశాలలున్నాయి. వాటిలో 12 పాఠశాలల్లో ఇంటర్ తరగతులు కొనసాగుతున్నాయి. జిల్లాలోని కస్తూర్బా పాఠశాలల్లో మొత్తం 72 ఉపాధ్యాయినుల పోస్టులు ఖాళీగా ఉండగా వాటిలో 53 పీజీ సీఆర్‌టీ పోస్టులు, 17 సీఆర్‌టీ పోస్టులు 2 పీఈటీ పోస్టులు ఉన్నాయి. వీటిలో రెండు పీఈటీ పోస్టులతో పాటు 13 సీఆర్‌టీ, 41 పీజీ సీఆర్‌టీ పోస్టులు భర్తీ అయ్యాయి. మిగిలిన పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దాదాపు నాలుగేళ్లుగా కస్తూర్బా పాఠశాలల్లో సీఆర్‌టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేయడంతో పాఠశాలల్లో బోధకుల కొరత దాదాపు తీరిందని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**విద్యార్థినులకు ఎంతో మేలు**

కస్తూర్బా పాఠశాలల్లో సీఆర్‌టీ, పీజీ సీఆర్‌టీ పోస్టులను భర్తీ చేయడం వల్ల విద్యార్థినులకు చాలా మేలు కలుగుతుంది. చాలాకాలంగా కస్తూర్బా పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. ప్రస్తుతం సీఆర్‌టీలు, పీజీ సీఆర్‌టీలు రావడంతో విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుంది.

– ఉమారాణి, జిల్లా సెక్టోరియల్ అధికారి, కామారెడ్డి

# మంచం పట్టిన తండా

- అన్నారం తండాలో ఇంటింటికీ జ్వరాలు
- ఆందోళన చెందుతున్న తండావాసులు
- పట్టించుకోని అధికారులు


అన్నారం తండా

రాజంపేట: మండలంలోని అన్నారం తండాలో ఇంటింటికీ విష జ్వరాలు వ్యాపించాయి. తండాలో ఇంటికి ఒకరు మంచాన పట్టారు. వారం రోజుల నుంచి విష జ్వరాలు ప్రబలడంతో తండావాసులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం వైద్య సిబ్బంది సైతం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేసినట్లు తండావాసులు పేర్కొన్నారు. వీరిలో కొంత మందికి రక్త పరీక్షలు సైతం నిర్వహించారు. ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేసినప్పటికీ జ్వరం నయం కాకపోవడంతో తండావాసులు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తే జేబులు ఖాళీ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత భారీ మొత్తంలో తండాలో అందరు విష జ్వరాల బారిన పడటం ఇదే మొదటిసారి అని గతంలో ఇంతలా ఎప్పుడు విషజ్వరాల బారిన పడలేదని వాపోతున్నారు. తండా పరిధిలో విష జ్వరాలు ప్రబలడంతో అప్రమత్తమైన పాలకవర్గం పారిశుద్ధ్యం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. తండాలో బ్లీచింగ్‌తో పాటు ఫాగింగ్ చేసినట్లు పంచాయతీ పాలకవర్గం పేర్కొంది. ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టు శుభ్రతగా ఉంచుకోవాలని సూచించినట్లు తెలిపారు.

### జ్వరం తగ్గడం లేదు



ఐదు రోజల నుంచి విష జ్వరంతో బాధపడుతున్నా. వైద్య శిబిరంలో రక్త పరీక్షలు చేసి మందు ఇచ్చారు. అయినా జ్వరం తగ్గలేదు.

– మెగావత్ పూన్యా, తండావాసి

### ఏరియా ఆస్పత్రికి పోయినా..



వారం రోజులుగా విషజ్వరంతో బాధపడుతున్నా. కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి వెళ్లి మందులు వేసుకున్నా జ్వరం తగ్గడం లేదు. ప్రైవేటు డాక్టరు దగ్గరకి వెళ్దాం అంటే పైసలు లేవు. అధికారులు స్పందించి మంచి వైద్యం అందించి మమ్మల్ని కాపాడాలి.

– మెగావత్ బూలీ, తండావాసురాలు

## జాతీయ భావాలు కాపాడటం బీజేపీకే సాధ్యం


భిక్కనూరులో మాట్లాడుతున్న మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాన్ శెట్టి

భిక్కనూరు:దేశంలో బీజేపీ మినహా మరే ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా జాతీయ భావాలను కాపాడే స్థితిలో లేదని మహారాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యే సచిన్ కల్యాన్ శెట్టి అన్నారు. శుక్రవారం ఆయన భిక్కనూరులోని ఎస్వీ గార్డెన్‌లో నిర్వహించిన ఎమ్మెల్యే ప్రవాస్ యోజన వర్కుషాపులో భాగంగా మండల కార్యకర్తలు, నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజలకు అవసరం ఉన్న ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రజలకు అందకుండా కొర్రిలు పెడుతుందని ఆరోపించారు. అందుకే కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఉండాలన్నారు. ప్రతి కార్యకర్త బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాలకు చెందిన 52 మంది బీజేపీలో చేరారు. అనంతరం మండల కేంద్రంలో వీధి వ్యాపారులతో కలిసి ఆయన భోజనం చేశారు. అంతకు ముందు బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి మండలాధ్యక్షుడు రెడ్డిగారి రమేశ్‌రెడ్డి, రవీందర్ రెడ్డి, యాదగిరిగౌడ్, సంధ్య, బస్వారెడ్డి, గణేశ్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, నర్సింహరెడ్డి, లక్ష్మి పావని, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**తలమడ్ల రైల్వే స్టేషన్ సందర్శన**

రాజంపేట: మండలంలోని తలమడ్ల రైల్వే స్టేషన్‌ను శుక్రవారం మహారాష్ట్ర ఎమ్మెల్యే సచిన్ కల్యాణ్ శెట్టి సందర్శించారు.

**సరస్వతి ఆలయంలో పూజలు**

కామారెడ్డి రూరల్: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఇల్చిపూర్ శివారులో గల సరస్వతి మాత ఆలయంలో సచిన్ కల్యాణ్‌శెట్టి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు పైల కృష్ణారెడ్డి, విఠల్ పటేల్, రొండ్ల నారాయణరెడ్డి, మహేష్ ఉన్నారు.

## సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



రామారెడ్డి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కామారెడ్డి డీఎస్పీ ప్రకాశ్ అన్నారు. మండలంలోని రంగంపేట గ్రామంలో శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసులు గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. సైబర్‌నేరగాళ్లు మాయమాటలతో మోసం చేస్తారని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దని అన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. తల్లిదండ్రులు వాహనాలను మైనర్లకు ఇవ్వొద్దని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించి నడపాలని సూచించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ శ్రీనివాస్, రామారెడ్డి ఎస్సై సుధాకర్, ఎంపీపీ దశరథ్ రెడ్డి, సర్పంచ్ శ్యామగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## భూవివాదంలో ఇరువర్గాల ఘర్షణ

రాజంపేట: భూవివాదంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకున్న ఘటన మండలంలోని కొండాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామంలోని సర్వే నంబరు 453లో ఉన్న భూమి తమదంటూ ముదిరాజ్, ఇతర కుల సంఘాల సభ్యులు ఘర్షణకు దిగారు. దీంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ముదిరాజ్‌లు నిర్మాణ పనులు చేపట్టవద్దని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ అనిల్ కుమార్ ఘటన స్థలానికి చేరుకొని గొడవను సద్దుమనిగేలా చేశారు. వివాద స్థలంపై విచారణ చేపట్టి న్యాయం చేస్తామని తహసీల్దార్ అన్నారు.

## ఫ్లెక్సీలు చించారని ఫిర్యాదు

సిరికొండ: మండల కేంద్రంలోని పలు చోట్ల ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారని కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. నిందితులపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు రవి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భూషణ్‌రెడ్డి, నాయకులు బండారి నరేశ్, పోశన్న, సురేశ్ ఉన్నారు.

## మలేషియాలో జిల్లావాసులకు వేధింపులు

- అండగా నిలిచిన ఎంపీ బీబీ పాటిల్


మలేషియాలో చిక్కుకున్న జిల్లా వాసులు

కామారెడ్డి క్రైం : ఉపాధి బాటలో ఇక్కడి ఏజెంట్లను నమ్మి మలేషియా దేశానికి వెళ్లిన 21 మంది జిల్లా వాసులు మోసానికి గురై ఆగమయ్యారు. వెట్టి చాకిరీ, వేధింపులకు గురి కావడంతో వారంతా గురువారం జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌ను ఫోన్ ద్వారా ఆశ్రయించగా ఆయన వెంటనే స్పందించారు. మలేషియాలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి వారందరినీ సురక్షితంగా జిల్లాకు రప్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఎంపీ వర్గీయులు శుక్రవారం తెలిపారు. మచారెడ్డి మండలం పోతారం గ్రామానికి చెందిన పురముశెట్టి భాను, గాంధారి మండలానికి చెందిన బెస్త సాయిలు, సేవ్యా, బీమా, తాడ్వాయి మండలం నందివాడకు చెందిన రవి, సోమారంకు చెందిన రమేష్ లింగంపేట్ మండలానికి చెందిన మాలోత్ లాస్యతో పాటు మొత్తం 21 మంది మూడు నెలల క్రితం మలేషియాలో ఉద్యోగాలున్నాయని కామారెడ్డిలో ఏజెంట్లు చెబితే కంపెనీ వీసా మీద రూ. 1.50 లక్షలు చెల్లించి వెళ్లారు. అక్కడకు వెళ్లగానే వారిని రిసీవ్ చేసుకున్న వ్యక్తి పాస్‌పోర్టులు లాక్కుని ఓ కాంట్రాక్టర్‌కు అమ్మేశాడని బాధితులు పేర్కొన్నారు. రెండు నెలలుగా పని చేయించుకోవడం తప్ప జీతం ఇవ్వట్లేదని, కనీసం తిండికూడా పెట్టట్లేదని వాపోయారు. దీంతో వారంతా ఎంపీ బీబీ పాటిల్‌కు వాట్సప్ ద్వారా సమాచారం ఇచ్చి ఫోన్‌లో మాట్లాడారు. ఎంపీ చొరవతో మరో 3–4 రోజుల్లో బాధితులు ఇక్కడకు తిరిగి రానున్నారు. వారంతా ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు.

## క్లుప్తంగా

### 61వ రోజుకు చేరిన పార్ట్‌టైం స్వీపర్ల దీక్షలు

కామారెడ్డి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైం స్వీపర్లు కామారెడ్డి ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 61వ రోజుకు చేరుకున్నాయి. వారు మాట్లాడుతూ..గత 45 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పాఠశాలల్లో స్వీపర్లుగా పనిచేస్తున్నామన్నారు. నెలకు రూ.150 వేతనం నుంచి పని చేస్తున్నామని ప్రస్తుతం రూ.4 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. బాలయ్య, సిద్దిరాములు, మునీరోద్దీన్, సయ్యద్ హైమద్, రాములు, గంగయ్య, మల్లేశం, భూమయ్య, నారాయణ, అశోక్, శంకర్, శివలింగం, సహదేవ్, వీరేశం పాల్గొన్నారు.

### పోగొట్టుకున్న ఫోన్ అందజేత

నాగిరెడ్డిపేట: మండలంలోని కన్నారెడ్డి గ్రామానికి చెందిన పేరుపల్లి రాజేశ్ పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను శుక్రవారం పోలీసులు అతనికి అప్పగించారు. రాజేశ్ మే 12న గోపాల్‌పేటలో తన ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు నాగిరెడ్డిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ నంబర్ ద్వారా మొబైల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు.

### దళితబంధు కోసం ఆందోళన



మాచారెడ్డి: దళితబంధు కొందరికేనా? అందరికీ ఎందుకివ్వరు అంటూ మండలంలోని అక్కాపూర్ గ్రామ దళితులు ఆందోళన బాట పట్టారు. శుక్రవారం అక్కాపూర్ గజ్యానాయక్ తండా రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. గ్రామంలో మొత్తం 120 దళిత కుటుంబాలు ఉండగా కొందరికి మాత్రమే దళిత బంధు ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లే ఓట్లేస్తారా? మేము వేయమా అంటూ ప్రశ్నించారు. దాదాపు రెండు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు.

### ఇల్లు దగ్ధం



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని జల్దిపల్లి గ్రామానికి చెందిన బేతయ్య ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమైనట్లు సర్పంచ్ కల్లు రవీందర్ శుక్రవారం తెలిపారు. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ. 80వేల ఆస్తినష్టం జరిగిందని ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబీకులు కోరారు.

### ఒకరిపై కేసు నమోదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బొల్లారం శివారులోని అటవీభూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు యత్నించిన మండలంలోని పల్లెబోగుడ తండాకు చెందిన దేవసోత్ బన్సీపై కేసునమోదు చేసినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. బొల్లారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ అనిత విధుల్లో భాగంగా బొల్లారం అటవీప్రాంతంలోని కంపార్ట్‌మెంట్ నం.736లో గస్తీ నిర్వహిస్తుండగా సుమారు రెండెకరాల అటవీభూమిని అక్రమంగా చదును చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడు బన్సీపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు పేర్కొన్నారు. ఎవరైనా అటవీభూమిని కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బీఎల్‌వో విధులు రద్దు చేయాలని వినతి


పిట్లంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పిట్లం(జుక్కల్): బాన్సువాడ ప్రాజెక్ట్ ఐసీడీఎస్‌లో పని చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌వో డ్యూటీని రద్దు చేయాలని శుక్రవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావుకు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ టీచర్లు ఇప్పటికే చాలా పనులు చూసుకుంటున్నారని పేర్కొన్నారు. ఇంకా భారం వేయకుండా బీఎల్‌వో డ్యూటీని రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు రవీందర్, ప్రాజెక్టు కార్యదర్శి రాధ, అంగన్వాడి టీచర్లు అనురాధ, రాజమణి, అపర్ణ, సుజాత, జగదీశ్వరీ, సావిత్రి, సవిత పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి: బీఎల్‌వో విధుల నుంచి అంగన్‌వాడీ సిబ్బందిని తొలగించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం తహసీల్దార్ సురేష్‌కు విన్నవించారు. సీడీపీవో పద్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే పనిభారంతో సతమతమవుతున్న తమను ఎన్నికల విధుల నుంచి మినహాయించాలని కోరుతూ శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు బాన్సువాడ ఆర్డీవో కార్యాలయంతో పాటు ఐసీడీఎస్ కార్యాలయంలో మెమోరాండం అందజేశారు. వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్ నిర్వహించడం, గర్భిణీ,, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ, రికార్డుల నిర్వాహణ, వివిధ యాప్‌లలో డాటా పంపించడం లాంటి పనుల్లో బిజీగా ఉంటున్నామన్నారు. వీరి డిమాండ్‌కు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షహనాజ్, సౌభాగ్య సంఘీభావం తెలిపారు. రేణుక, శివజ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

## ఏఎన్‌ఎం నోటిఫికేషన్ పత్రాల దహనం



నోటిఫికేషన్ పత్రాలు దహనం చేస్తున్న ఏఎన్‌ఎంలు

కామారెడ్డి టౌన్: తమను క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు చేపడుతున్న సమ్మె శుక్రవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపడుతున్న సమ్మె శిబిరం ముందు ఏఎన్‌ఎం రెగ్యూలర్ పోస్టుల నోటిఫికేషన్ పత్రాలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు, ఏఎన్‌ఎంలు మాట్లాడుతూ పరీక్ష రద్దు చేసి కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల క్రమబద్ధీకరణ సాధ్యం కాదంటున్న డీహెచ్ శ్రీనివాస్, మంత్రి హరీశ్‌రావు ఇతర శాఖల్లో కాంట్రాక్ట్ ఉద్యోగులను ఎలా రెగ్యూలర్ చేశారని ప్రశ్నించారు. గత 20 ఏళ్లుగా విధులు చేస్తున్న ఉద్యోగాలకు మళ్లీ పరీక్ష రాయడం ఏంటని ప్రశ్నించారు. మెడికల్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్ దశరథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌ఆర్ రాజశేఖర్, కాంట్రాక్ట్, సెకండ్ ఏఎన్‌ఎంలు కె సుమలత, మహేశ్వరి, లింబమ్మ, హెచ్ గంగమని, సావిత్రి, ఆసియా సుల్తానా, నాగజ్యోతి తదితరులున్నారు.

## బీఆర్‌ఎస్‌ను భూ స్థాపితం చేస్తాం


కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

- మాజీ మంత్రి షబ్బీర్ అలీ

కామారెడ్డి టౌన్ : కామారెడ్డితో పాటు గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడించడం ఖాయమని, ఇక బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేస్తామని మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గజ్వేల్‌లో ఓడిపోతానని తెలిసి కామారెడ్డిలో పోటీకి వస్తున్నాడని సీఎంపై మండి పడ్డారు. కామారెడ్డి ప్రజలు తస్మాత్ జాగ్రత్త అని ల్యాండ్ మాఫియా దిగుతుందన్నారు. గద్దర్ లాంటి ప్రజాఉద్యమకారుడిని కేసీఆర్ ప్రగతిభవన్ గేటు దాటనివ్వలేదన్నారు. గజ్వేల్, హైదరాబాద్‌లను సీఎం కేసీఆర్ అమ్మేశారన్నారు. కామారెడ్డిని అమ్మేసేందుకే రింగురోడ్డు ప్రస్తావనను తీసుకొస్తున్నారన్నారు. నేనేం ఏం చేశానని కేటీఆర్ తనను ప్రశ్నించారని, నేను చేసిన అభివృద్ధిని కేసీఆర్ ద్వారా తెలుసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ కవిత లిక్కర్ రాణిగా కొనసాగుతుందని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 10 వేల కోట్ల మిగులు బడ్జెట్ ఇస్తే రూ. ఐదున్నర లక్షల కోట్ల అప్పు చేసిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. కామారెడ్డిలో పాండవులు.. కౌరవుల మధ్య భీకర యుద్ధం జరగబోతోందన్నారు. ఒక్కసారి తనను ఆశీర్వదిస్తే తన సత్తా చాటుతానన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్‌లో 5వేల ఇళ్లు కడతామని చెప్పి గజ్వేల్‌లో కేవలం 1200 ఇళ్లు మాత్రమే కట్టారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## బీపీ మండల్‌కు ఘన నివాళి


కామారెడ్డిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


బాన్సువాడలో..

కామారెడ్డి టౌన్: బీసీ రిజర్వేషన్ పితామహుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ 105వ జయంతిని బీసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శివరాములు, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ యాదవ్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాత రాము తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడ: సంఘ సంస్కర్త, వెనుకబడిన తరగతుల కమిషన్ మాజీ చైర్మన్ బీపీ మండల్ జయంతిని శుక్రవారం బాన్సువాడలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌గౌడ్ మాట్లాడుతూ బీపీ మండల్ బీసీల హక్కుల కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన మహోన్నతమైన వ్యక్తి అని కొనియాడారు. నిఖిల్, విజయ్‌కుమార్, రాఘవేంద్ర, సాయితేజ, నవీన్, రాజు, విష్ణు ఉన్నారు.



## క్రైం కార్నర్

### నీటి సంపులో పడి వ్యక్తి మృతి


లక్ష్మణ్(ఫైల్)

బాన్సువాడ/బాన్సువాడరూరల్: బాన్సువాడ పట్టణంలోని టౌన్ షిప్ వెంచర్‌లో ప్రమాదవశత్తు నీటి సంపులో పడి జగ్గ లక్ష్మణ్ (40) అనే వ్యక్తి మృతి చెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. బోర్లం గ్రామానికి చెందిన లక్ష్మణ్ టౌన్ షిప్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన లక్ష్మణ్ సాయంత్రం వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇంటి నిర్మాణం వద్దకు వెళ్లి చూడగా నీటిలో మృతదేహం లభ్యమైందన్నారు. మృతుడి భార్య కాశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### రైలు నుంచి పడి ఒకరు..



కామారెడ్డి క్రైం: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కామారెడ్డి రైల్వే స్టేషన్ పరిధిలోని బ్రాహ్మణపల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉదయం 11:30 గంటల ప్రాంతంలో ప్రయాణిస్తున్న రైలు నుంచి వ్యక్తి కింద పడి మృతి చెందినట్లు సమాచారం అందడంతో కామారెడ్డి రైల్వే ఎస్సై తావునాయక్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, జేబులో ఉన్న టికెట్ ఆధారంగా దేనాపూర్ నుంచి సికింద్రాబాద్ ప్రయాణిస్తున్నట్లు తెలిపారు. మృతుని వయస్సు సుమారు 40 ఏండ్ల మధ్య ఉంటాడని, ఎవరైనా ఫొటో ఆధారంగా గుర్తు పడితే రైల్వే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### చిరుత దాడిలో మేక..

లింగంపేట(ఎల్లారెడ్డి): చిరుత దాడిలో మేక మృతి చెందిన ఘటన మండలంలోని మెంగారం అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తంత్రి అంజయ్య మేకలను అటవీ ప్రాంతానికి మేతకు తీసుకెళ్లగా చిరుత మేకపై దాడి చంపేసిందని బాధితుడు తెలిపాడు. చిరుత సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

### పేకాట స్థావరంపై దాడి

కామారెడ్డి క్రైం: మండలంలోని శాబ్దిపూర్ శివారులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు పక్కా సమాచారం అందడంతో దాడి నిర్వహించామని వారి నుంచి రూ.65,790 నగదు, 8 సెల్ ఫోన్లు, ఆటో, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు పేర్కొన్నారు.

### బోధన్‌లో గొలుసు చోరీ

బోధన్‌టౌన్(బోధన్): పట్టణ శివారులో ఓ మహిళ మెడ నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించినట్లు సీఐ ప్రేమ్‌కుమార్‌తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. బోధన్ శివారులోని మర్రి మైసమ్మ ఆలయంలో పూజారిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మి శుక్రవారం ఉదయం ఆలయానికి వెళ్తుండగా బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లినట్లు చెప్పారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

### యువకుడి అదృశ్యం

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన డొక్క పరశురాం (28) అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పరశురాం రాత్రి వరకు ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పరశురాం అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఐకేపీ ఉద్యోగి ఆత్మహత్య


సాయిలు(ఫైల్)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామానికి చెందిన గుడుమ బక్క సాయిలు(48) శుక్రవారం అనారోగ్యంతో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. సాయిలు లింగంపేట ఐకేపీ కార్యాలయంలో మండల సమాఖ్య క్లస్టర్ కో–ఆర్డినేటర్‌గా పనిచేస్తున్నాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సాయిలు ఆస్పత్రుల్లో చూయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య సవిత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

**మనస్తాపంతో యువకుడు..**

బాన్సువాడ రూరల్: మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన బండారి రవి(29) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆరేళ్ల క్రితం హిప్పర్గ గ్రామానికి చెందిన సురేఖతో కొల్లూర్‌కు చెందిన రవితో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. భార్యభర్తల మధ్య కొన్ని రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో ఈ నెల 23న వీరి మధ్య గొడవ జరగడంతో సురేఖ కూతురుని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురై రవి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి అంజవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

**ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..**

కామారెడ్డి క్రైం: ఆర్థిక ఇబ్బందులు, ఫైనాన్స్ నిర్వాహకుల వేధింపులు భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డిలోని లక్ష్మీనగర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన విజయ్‌కుమార్ (27) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల ఓ ప్రైవేటు కంపెనీలో ఫైనాన్స్ తీసుకొని బైక్ కొన్నాడు. కొన్ని వాయిదాలు పెండింగ్‌లో ఉండడంతో నిర్వాహకుల వేధింపులు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి బాలరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### ఇసుక లారీ పట్టివేత



దోమకొండ: మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై మురళి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రాజన్న సిరిసిల్లా జిల్లా నుంచి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో లారీని పట్టుకొని సీజ్‌చేసినట్లు తెలిపారు. ఎవరైనా ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.